ఇంటింటి సర్వేకు ప్రజలు సహకరించాలి

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి



కోకాపేటలో సర్వే వివరాలు తెలుసుకున్న జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

మణికొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి కోరారు. గురువారం నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేటలో కొనసాగుతున్న సర్వే తీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అపార్ట్‌మెంట్‌లలో సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్వే సందర్భంగా సమగ్ర వివరాలు తీసుకున్న అనంతరం ఇంటికి అతికించిన స్టిక్కర్, వాటిపై నమోదు చేసిన ఇంటి నెంబర్, ఎన్యూమరేషన్ బ్లాక్, క్రమ సంఖ్య తదితర వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సర్వే చేయాల్సిన విధానం, వివరాల సేకరణపై ఎన్యూమరేటర్‌లకు పలు సూచనలు చేశారు. సర్వేకు వచ్చే అధికారులు, సిబ్బందికి ప్రజలు వాస్తవ సమాచారాన్ని మాత్రమే అందించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద సంపూర్ణ సమాచారం ఉంటేనే రాబోయే రోజుల్లో ప్రజలకు మరింత మేలు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఎలాంటి తప్పిదాలు లేకుండా సర్వే చేయాలని, పూర్తి వివరాలను ప్రజల నుంచి సేకరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నార్సింగి మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణమోహన్‌రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా ఇంటింటి సర్వే ప్రక్రియ



ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ప్రభుత్వ ఆదేశాలను విజయవంతం చేసేందుకు అధికారులు, సిబ్బంది కష్టపడి పని చేయాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే కార్యక్రమంలో భాగంగా డోర్ స్టికరింగ్ ప్రకియను గురువారం ఆయన పరిశీలించారు. ఆనంద్‌నగర్ కాలనీ, ఇంద్రారెడ్డి కాలనీ, కపిలానగర్ కాలనీలో ఎన్యూమరేటర్లు ఇంటింటికీ తిరిగి సర్వే చేపట్టి స్టిక్కర్లను అంటిస్తున్నారన్నారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. బిల్ కలెక్టర్లు రాజశేఖర్, ఎం.డి.నహీం, పి.చంద్రశేఖర్, మానస తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఛట్ పూజ

- వేలాదిగా పూజల్లో పాల్గొన్న మహిళలు
- చెరువులు, కొలనుల వద్ద ఉత్తరాదివాసుల సందడి
- భక్తిశ్రద్ధలతో సూర్యభగవానుడికి పూజలు



ఉత్తర భారత సమాజ్ వారితో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి



లక్ష్మీగూడ హౌసింగ్ బోర్డు కాలనీలో ఛట్ పూజలో పాల్గొన్న బీజేపీ నేత అడికె రాజు



టీఎన్జీవోస్ కాలనీలోని వెంకటేశ్వర ఆలయ ప్రాంగణంలోని కొలనులో...

మైలార్‌దేవ్‌పల్లి: ఉత్తర భారతీయులు వేడుకగా నిర్వహించే ఛట్ పూజలు మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో ఘనంగా జరిగాయి. కార్తీక మాసంలో నాలుగు రోజులు ఉపవాస దీక్షలో ఉంటూ మహిళలు భక్తి శ్రద్ధలతో ఈ పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు. అందులో భాగంగా మహిళలు సూర్యదేవుడిని పరమపవిత్రంగా పూజిస్తారు. ఈ నేపథ్యంలో చెరువు ప్రాంతాలలో నిర్వహించే ఛట్ పూజల్లో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. గురువారం లక్ష్మీగూడ కొత్త చెరువు ప్రాంతంలో ఉత్తర సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. లక్ష్మీగూడ హౌసింగ్ బోర్డులో నీటి కొలను ఏర్పాటు చేసి అందులో చెరకు కట్టలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీఎన్జీవోస్ కాలనీలోని వెంకటేశ్వర ఆలయం ప్రాంగణంలో నీటి కొలనులో వందలాది మంది భక్తులు ఛట్ పూజా కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా చేశారు. ఈ సందర్భంగా బిహార్ సమాజ్ వారు మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం దీపావళి తర్వాత ఆరవ రోజు నుంచి నాలుగు రోజులు ఛట్ పూజలు చేస్తామని అన్నారు. ఇందులో మహిళలు భక్తి శ్రద్ధలతో సూర్య భగవానుడికి ఉభయ సంధ్య వేళల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని వివరించారు.

సందడిగా కార్తీక వన భోజనాలు



వన భోజనంలో పాల్గొన్న మేయర్ లతాప్రేమ్‌గౌడ్, మహిళలు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు కాలనీల మహిళలు గురువారం కార్తీక మాసం వనభోజనాలను సందడిగా నిర్వహించుకున్నారు. కార్పొరేషన్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్ ఆధ్వర్యంలో వన భోజన కార్యక్రమాన్ని చేపట్టారు. కాలనీలకు చెందిన మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వారికి పలు క్రీడలు, ఆటల పోటీలను నిర్వహించారు. విజేతలకు ప్రోత్సాహకాలను అందజేశారు.

కష్టపడితే లక్ష్య సాధన సులువే



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

అత్తాపూర్: విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను ఇష్టంతో కష్టపడితే సులువుగా చేరుకోవచ్చని రాజేంద్రనగర్ జోనల్ సెక్రటరీ కె.గాంగ్యనాయక్ అన్నారు. శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కబడ్డీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 9వ తరగతి చదువుతున్న కె.సాంబన్నా, సబా అన్సారి, బారిష్‌లు ఎంపికైనట్లు తెలిపారు. వీరు ఈ నెల 8వ తేదీన జరిగే పోటీలకు వెళ్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను ఆయన అభినందించారు. ఉత్తమ ప్రదర్శన కనబరిచి సత్తాచాటాలని సూచించారు.



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సంగీత

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ఎప్పటికప్పుడు అభివృద్ధి పనులను చేపడుతున్నామని కార్పొరేటర్ మోండ్ర సంగీత గౌరీశంకర్ అన్నారు. గురువారం పాండురంగానగర్‌లో రూ. 20 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... పాండురంగా నగర్ చిన్న అంతగిరి శివాలయం సమీపంలో రోడ్డు గోతులమయంగా కావడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించించేందుకు నిధులను మంజూరు చేయించామన్నారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి మోండ్ర కొమురయ్య, లక్కన్‌సింగ్, ఉమాభాయ్, ముఖేష్, బిరాదర్, విజయ రావత్, రాహుల్, బాలకృష్ణ, జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు, ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

హైదరాబాద్ నాలెడ్జి సిటీలో వీధి వ్యాపారుల ధర్నా



నాలెడ్జి సిటీ రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేస్తున్న స్ట్రీట్ వెండర్స్

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని ఐటీసీ కోహినూర్ హోటల్ వద్ద ప్రధానరోడ్లు, ఫుట్‌పాత్‌లపై ఫుడ్‌స్టాల్స్, టీస్టాల్స్, ఇతరత్రా వాటిని గురువారం తొలగించారు. టీఎస్‌ఐఐసీ, ఐలా అధికారులు ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌తో సైబరాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో ఫుట్‌పాత్‌లు, రోడ్లపై ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను తొలగించారు. దీంతో వీధి వ్యాపారులు అడ్డుకోవడానికి ప్రయత్నించారు. అనంతరం రోడ్డుపై ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇదే తమ జీవనాధారమని ,ఆకస్మాత్తుగా తొలగించాలని ఆదేశించడం ఎంత వరకు న్యాయమని వాపోయారు. గతంలో కుమారి ఆంటీ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆ ప్రాంతంలో ఫుడ్‌స్టాల్స్‌కు అనుమతి ఇచ్చి ప్రస్తుతం ఇక్కడ తొలగించాలని ఆదేశించడం ఏంటని వాపోయారు. వ్యాపారం చేసుకోవడానికి అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి


సైబరాబాద్ సీపీ అవినాష్‌మహంతి



సైబరాబాద్ కమిషనరేట్‌లో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీపీ అవినాష్ మహంతి

రాయదుర్గం: కేన్సర్ అనేది తీవ్ర ఆరోగ్య సమస్య అని సైబరాబాద్ కమిషనర్, ఎస్‌సీఎస్‌సీ చైర్మన్ అవినాష్ మహంతి పేర్కొన్నారు. గురువారం సైబరాబాద్ కమిషనరేట్‌లో సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్(ఎస్‌సీఎస్‌సీ), గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో క్యాన్సర్, ఎన్‌సీడీ స్క్రీనింగ్ బస్ ద్వారా గ్రేస్ క్యాన్సర్ ఫౌండేసన్ గ్లోబల్ సీఈఓ డాక్టర్ సుంకవల్లి చినబాబు, డాక్టర్ ప్రమీలారాణి, వైద్య బృందం సంయుక్త ఆధ్వర్యంలో వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేన్సర్‌ను ముందుగా గుర్తిస్తే సకాలంలో చికిత్స తీసుకుని తగ్గించుకోవచ్చన్నారు.పోలీసులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్ గ్లోబల్ సీఈఓ డాక్టర్ చిన్నబాబు సుంకవల్లి మాట్లాడుతూ ప్రతి యేటా భారతదేశంలో రెండు మిలియన్ కేన్సర్ కేసులు నమోదు అవుతున్నాయన్నారు. కార్యక్రమంలోసైబరాబాద్ జాయింట్ కమిషనర్ డి జోయల్ డేవిస్, ఎస్‌సీఎస్‌సీ సెక్రెటరీ జనరల్ రమేష్ కాజా, ఏడీసీపీలు రవిచందన్ రెడ్డి, షమీర్, ఏసీపీ గంగారామ్, ఎస్‌సీఎస్‌సీ అసోసియేట్ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్, హెల్త్ ప్రోగ్రామ్ మేనేజర్ ప్రవీణ్ ఉమ్మడి,ఎస్‌సీఎస్‌సీ విమెన్స్ ఫోరమ్ మెంబర్ రిలేషన్స్ మేనేజర్ లలిత, సీటీసీ డాక్టర్ డాక్టర్ సరిత, ఫౌండేషన్ సలహాదారు గారపాటిప్రసాద్, వ్యవస్థాపక ట్రస్టీ డాక్టర్ ప్రమీలారాణి, సైకియాట్రిస్ట్ డాక్టర్ దీప్తి,డాక్టర్ సురి, 35 మంది వైద్య బృందం, బీఎస్ రాజేష్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



ఆయా కుటుంబాలకు చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: నిరుపేద రోగులను సీఎంఆర్‌ఎఫ్ ఆదుకుంటోందని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని 60 మంది లబ్ధిదారులకు రూ.24.60 లక్షల చెక్కులను ఆయన గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు సంజీవరెడ్డి, అక్తర్, శ్రీనివాస్, రాజేందర్, కాశీనాథ్‌యాదవ్, ఇబ్రహీమ్, ఆష్రాఫ్, అనిల్, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి ధర్నాను విజయవంతం చేయండి: బీజేపీ

రాజేంద్రనగర్: ఎన్నికల హామీలైన ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత విధానాలకు నిరసనగా బీజేపీ ఆధ్వర్యంలో శనివారం రాజేంద్రగనర్‌లో చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని బీజేపీ నాయకులు పొన్నామోని మల్లేష్ యాదవ్, బుర్రం మహాలింగంగౌడ్ పిలుపునిచ్చారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి సంవత్సరం అయినా పేదలకు కనీస అవసరమైన రోడ్లు, వీధి దీపాలు, డ్రైనేజీ, తాగునీరు లాంటి వసతులను కల్పించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా శనివారం ఉదయం 10 గంటలకు రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు బీజేపీ నాయకులు తెలిపారు. నియోజకవర్గం పరిధిలోని పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, ప్రజా ప్రతినిధులు, బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ధర్నాను విజయవంతం చేయాలని వారు కోరారు.

రంగనాథస్వామి ఆలయంలో పూజలు

జియాగూడ: జియాగూడ రంగనాథస్వామి ఆలయాన్ని బుధవారం రాత్రి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని కుటుంబ సభ్యులతో దర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చక బృందం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నందిని, కుటుంబసభ్యులకు తీర్థ ప్రసాదాలు అందిచి ఆలయ ప్రతినిధి శేషాచారి బద్రీనాథచార్యులు, రంగనాథచార్యులు వేద మంత్రాలతో వారిని ఆశీర్వదించారు.

ప్రత్యేక పూజలు

గోల్కొండ: నానల్‌నగర్ డివిజన్ ఫ్లోర్ మిల్ వద్ద గల కోవెల రంగనాయక స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ ప్రాంగణంలో శివలింగ ప్రతిష్ఠాపనోత్సవం విజయవంతంగా ముగించిన సందర్భంగా చండీ ఉపాసకులు అభినందన్ నివేది ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు జరిగాయి. సుంకరి శాలిని ప్రేమ్‌కిషోర్ పూజా కార్యక్రమాలను నిర్వహించగా ఎస్.జనార్దన్, ఎం.నర్సింహ పాల్గొన్నారు.

9 నుంచి క్రికెట్ టోర్నమెంట్

గోల్కొండ: ఈ నెల 9వ తేదీ నుంచి దేవర కరుణాకర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కార్యదర్శి దేవర వంశీ తెలిపారు. దివంగత కార్పొరేటర్ దేవర కరుణాకర్ పేరిట ఈ టోర్నమెంట్‌ను గుడిమల్కాపూర్‌లోని రాజలింగయ్య కబడ్డీ స్టేడియంలో నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. వివరాలు, పేర్ల నమోదు కోసం 99081 10529లో సంప్రదించవచ్చునని ఆయన సూచించారు. పాల్గొనే క్రీడాకారుల వయస్సు 25 సంవత్సరాలలోపు ఉండాలని తెలిపారు.

యువత స్వయం ఉపాధి వైపు దృష్టి సారించాలి

గోల్కొండ: యువత వ్యాపారం వైపు దృష్టిసారించాలని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. గురువారం ఆయన అక్బర్‌బాగ్‌లోని తన కార్యాలయంలో షేక్‌పేట్, డివిజన్‌కు చెందిన యువజన సంఘాల ప్రతినిధులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉపాధి కల్పన విషయంలో ప్రభుత్వాలు ఎంతగానో కృషి చేస్తున్నాయన్నారు. యువత వ్యాపార రంగం వైపు దృష్టిసారిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ ఇస్మాయిల్, యూసుఫ్, పూర్ణచందర్ తదితరులున్నారు.

కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా జగన్



నియామకపత్రాన్ని అందుకుంటున్న జగన్

శంషాబాద్: కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడిగా పట్టణంలోని సిద్ధాంతి బస్తీకి చెందిన రాచమల్ల జగన్ నియమితులయ్యారు. ఈ మేరకు నియామకపత్రాన్ని ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ రాజ్‌కుమార్ గురువారం ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మన్ ప్రీతంతో పాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇతర మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు.

ఒత్తిడి తాళలేక యువకుడి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన సాయి కుమార్

అత్తాపూర్: ఒత్తిడి తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటరామిరెడ్డి సమాచారం మేరకు... మహబూబ్‌నగర్ జిల్లా మాచన్‌పల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్ కుటుంబంతో కలిసి 15 ఏళ్ల క్రితం నగరానికి వచ్చి అత్తాపూర్‌లో నివాసముంటున్నారు. శ్రీనివాస్‌కు ఇద్దరు కుమారులు ఉన్నారు. శ్రీనివాస్ కొన్ని సంవత్సరాల క్రితం మృతి చెందగా.. ఇద్దరు కుమారులతో కలిసి తల్లి నివాసముంటుంది. చిన్న కుమారుడు సాయి కుమార్(20) ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. కొంత కాలంగా ఒత్తిడితో ఉంటున్న సాయి కుమార్ బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ వివరించారు.

ప్రత్యేక ప్రార్థనలు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్‌కు అన్ని వర్గాల ప్రజల ఆదరణ ఉందని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన నాన్‌దేడ్ దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహారాష్ట్రలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో మన పార్టీ బరిలో అభ్యర్థులను నిలిపిందన్నారు. పోటీ చేస్తున్న 16 స్థానాలను కైవసం చేసుకోవడం ఖాయమన్నారు. కార్వాన్ నియోజకవర్గంలో పార్టీలు, కులమతాలకు అతీతంగా అభివృద్ధి పనులు చేయించామన్నారు. ఆయన వెంట మజ్లిస్ నాయకులు హారూన్‌ఫరాన్, ఎస్ఏ ఖాన్ తదితరులున్నారు.

లాకర్‌లో బంగారం మాయం..?

లంగర్‌హౌస్: బ్యాంకు లాకర్‌లో దాచిన తన బంగారం మాయమైందని ఓ వ్యక్తి పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడు తెలిపిన మేరకు.. లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఖాదర్‌బాగ్‌లో నివాసముండే మొహమూద్ నానల్‌నగర్ వద్ద ఉన్న ఇండియన్ బ్యాంకులో జనవరి 30న లాకర్‌లో 35 తులాల బంగారు నగలు పెట్టానని చెబుతున్నాడు. అనంతరం సౌదీ వెళ్లిపోయిన అతను గత నెలలో తిరిగి వచ్చాడు. ఈ నెల 5న బ్యాంకుకు వెళ్లి లాకర్ తెరవగా అందులో బంగారం కనిపించలేదని చెబుతున్నాడు. ఈ విషయంపై పోలీసులు బ్యాంకు అధికారులను అడగ్గా లాకర్‌లో ఏమి దాచుకున్నారనే వివరాలు తాము సేకరించకూడదని తెలిపారు. తాము కేవలం లాకర్‌ను అద్దెకు ఇస్తామని, కాని ఆ తాళం చెవి లేకుండా వేరొకరు లాకర్ తెరిచే అవకాశం లేదని తేల్చిచెప్పారు. బాధితుడు ఫిర్యాదు చేస్తే విచారణ చేపడతామని పోలీసులు చెబుతున్నారు.

మందకృష్ణ పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ



చాంద్రాయణగుట్ట: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పోరాట ఫలితంగానే వర్గీకరణ జరుగుతుందని ఎమ్మార్పీఎస్ పాత నగర ఇన్‌చార్జి ఎస్.ఎం.నర్సింహ స్వామి మాదిగ అన్నారు. ఖైరతాబాద్‌లో జరిగిన మాదిగల ధర్మయుద్ధ సన్నాహక సదస్సుకు చాంద్రాయణగుట్ట నియోజకవర్గం నుంచి కార్యకర్తలతో కలిసి తరలివెళ్లారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగకు పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు రేణుక తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అధిగమిస్తే కఠిన చర్యలు

లంగర్‌హౌస్: నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపి ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దని ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మి, లంగర్‌హౌస్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య అన్నారు. లంగర్‌హౌస్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏసీపీ ధనలక్ష్మి ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా హెల్మెట్ ధరించి వాహనాలు నడుపుతున్నవారికి మిఠాయిలు తినిపించి, రోజా పువ్వులు అందించి ధన్యవాదాలు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపిన దాదాపు 120 మందిపై కేసులు నమోదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఇంట్లో తమ కోసం వేచిచూసే కుటుంబీకులను దృష్టిలో పెట్టుకొని వాహనాలు నడపాలన్నారు.

రోడ్డుపై పడ్డ పెద్ద చెట్టు తొలగింపు



బండ్లగూడ: ప్రజల ఇబ్బందులను తెలుసుకొని వాటికి అనుగుణంగా చర్యలు తీసుకుంటామని కాంగ్రెస్ పార్టీ బండ్లగూడ జాగీరు మున్సిపల్ నాయకుడు ప్రేమ్‌గౌడ్ అన్నారు. శిశుమందిర్ స్కూల్ సమీపంలో ప్రమాదవశాత్తు భారీ చెట్టు రోడ్డుపై కూలాపోయింది. దీంతో పాదచారులు, వాహనదారులు, విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. విషయం తెలుసుకున్న ఆయన స్థానికుల సాయంతో రోడ్డుపై పడిన చెట్టును పక్కను లాగించి రోడ్డును క్లీయర్ చేయించారు. సంఘటన జరిగిన ప్రాంతానికి సమాపంలోని నివాసం ఉంటున్న రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్, స్థానికులలో కలిసి రోడ్డుపైన పడిన చెట్టును తొలగించామని ఆయన వివరించారు.